www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 20 సెప్టెంబర్ 2024

5

తిరుపతి



శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో బదిలీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తిని తక్షణమే బదిలీ చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ గా ఉన్న ఎస్వీఎస్ఎన్ మూర్తి కొద్దిరోజులు పాటు శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా వ్యవహరించారు. తాజా బదిలీ ఉత్తర్వుల మేరకు ద్వారా తిరుమల దేవస్థానం ఈవోగా ఆయన బాధ్యతలు తీసుకుంటారు. . అయితే ఆయన స్థానంలో తిరుపతి ఆర్జేసీగా ఉన్న చంద్రశేఖర్ ఆజాద్ శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని ఆలయ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఎస్వీఎస్ఎన్ మూర్తి శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా ఉన్నన్నాళ్లు ఆలయంలో దళారీ వ్యవస్థ నిర్మూలనకు, అక్రమ వసూళ్లకు చెక్ పెట్టి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు.

శ్రీవారి భక్తుల మనోభావాలతో...

లడ్డూ రాజ'గీ'యం

సిఎం వ్యాఖ్యలపై దుమారం

తిరుమల తిరుపతి దేవస్థానం అత్యంత హిందూ ధార్మిక సంస్థ. హిందుత్వాన్ని కాపాడటంలో ఎప్పుడూ ముందుంటుంది. ఒకవేళ ఏదైనా జరిగినా వేలాది మంది ఉద్యోగులకు, ఉన్నతాధికారులకు తెలియకుండా జరిగే అవకాశమే లేదు.. లడ్డు పోటులో పనిచేసే వందలాది మంది కార్మికులకు తెలియక పోదు.. తిరుమల లడ్డులో వాడే నెయ్యి విషయంలోనూ అంచెలంచెలుగా పరిశీలనలు ఉంటాయి.. ల్యాబ్‌లో పరీక్షించే నెయ్యిని ఉపయోగిస్తారు.. ఒకవేళ అడపాదడపా ఏదైనా పొరపాటు జరిగి ఉంటే అప్పటికప్పుడు చర్యలు తీసుకుని, నాణ్యమైన నెయ్యిని వాడేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే అలా కాకుండా ముఖ్యమంత్రి స్థాయిలో భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా 'రాజకీయం'గా ఈ విషయాన్ని వాడుకోవడం విమర్శలకు తావిస్తోంది. వైసిపి పాలనపై బురద చల్లాలన్న, అత్యుత్సాహంతో భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా టిడిపి కూటమి వ్యవహరిస్తోందన్నది మెజార్టీ రాజకీయ వర్గాల భావన. స్వయానా సిఎం చంద్రబాబునాయుడు శ్రీవారి లడ్డూలకు వాడే నెయ్యిలో అవు కొవ్వు కల్తీ ఉందని వ్యాఖ్యలు చేయడంపై భక్తులే కాదు ఉద్యోగులు సైతం నివ్వెరపోతున్నారు. ప్రధాన ప్రతిపక్షమైన వైసిపి నుంచి అంతే స్థాయిలో ఘాటైన ఖండన వస్తోంది. ఏదిఏమైనా సిబిఐ విచారణ జరిపి, ఒకవేళ నిగ్గు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలే తప్ప, భక్తుల మనోభావాలతో ఆడుకోవడం సరికాదన్నది విజ్ఞుల వాదన.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానంలో ఏ ప్రసాదం తయారీకైనా దానికి వినియోగించే ఆహార పదార్థాలను తనిఖీ చేయడానికి టిటిడి పరిధిలో ల్యాబ్ ఉంటుంది. పదార్థాలను తనిఖీ చేసిన తరువాతనే వినియోగిస్తారు. సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సిఎఫ్‌టిఆర్ఐ, మైసూరు) పరిధిలో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తారు. ఇది కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో నడుస్తోంది. విశ్రాంత శాస్త్రవేత్త, మరో 12 మంది నిపుణులైన ఉద్యోగుల పర్యవేక్షణలో ఈ తనిఖీ జరుగుతుంది. ఈ తనిఖీ పర్యవేక్షణకు టీటీడీ నుంచి రోజుకొక బందం చొప్పున ప్రతిరోజూ సర్టిఫై చేసిన తర్వాతనే ప్రసాదాలకు వినియోగించే ఆహార పదార్థాలను స్వీకరిస్తారు. టిటిడి నాణ్యతా ప్రమాణాలకు లోబడే నెయ్యి వినియోగం ఉంటుంది. కరోనా సమయంలో మినహా మిగిలిన మూడున్నర సంవత్సరాల కాలంలో వైసిపి హయాంలో నెయ్యి వినియోగానికి సంబంధించిన ట్యాంకర్లు నాణ్యతా ప్రమాణాలకు లోబడి లేవని పరీక్షల్లో తేలడంతో 20కి పైగా ట్యాంకర్లను తిప్పి పంపిన విషయమూ రికార్డుల్లో నమోదై ఉండటం గమనార్హం.

ఉద్యోగులను అవమానించడమే : కందారపు మురళి

తిరుమల కొండపై లడ్డూల తయారీలో జంతువుల కొవ్వును వినియోగిస్తున్నారని స్వయంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించడం టిటిడి ఉద్యోగులను అవమానించడమేనని టిటిడి ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో విమర్శించారు. టీటీడీలో పారదర్శకమైన విధానాలు ఉన్నాయని, ఏ ప్రసాదం తయారీకైనా దానికి వినియోగించే ఆహార పదార్థాలను తనిఖీ చేయడానికి టీటీడీ పరిధిలో ల్యాబ్ ఉందని, ఈ ల్యాబ్ లో తనిఖీలు చేసిన తర్వాతనే వినియోగిస్తారని గుర్తు చేశారు. వాస్తవం ఇది కాగా ముఖ్యమంత్రి స్థాయిలోని వ్యక్తి తేలికగా ఇట్లాంటి ఆరోపణలు చేయటం సమంజసం కాదని భక్తుల మనోభావాలను, టీటీడీ ఉద్యోగులను అవమానించినట్లే అవుతుందన్నారు. ఏదైనా అక్రమ వ్యవహారాలకు సంబంధించి తప్పులు ఉంటే బాధ్యులను కఠినంగా శిక్షించడానికి ఎవరికీ అభ్యంతరం లేదని, తన ప్రత్యర్థులను దెబ్బతీయాలనే పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంపిక చేసుకున్న మార్గం సరైంది కాదని హితవు పలికారు.

కులాంతర వివాహం చేసుకున్నారని...

అంజూరుపాలెంలో 'జాత్యాహంకారం'

దళితులపై పెత్తందారుల మూకుమ్మడి దాడి / అట్రాసిటీ కేసు నమోదుకు డిమాండ్

తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో ఆరుగురు / దళితులకు అండగా కెవిపిఎస్, బీఎస్పీ, ఎమ్మార్పీఎస్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

కులాంతర వివాహం చేసుకున్నారని మూకుమ్మడిగా అరుంధతివాడపై దాడికి పాల్పడిన జాత్యాహంకార ఘటన గురువారం తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం అంజూరు పంచాయతీ అంజూరు పాలెం గ్రామంలో చోటు చేసుకుంది. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన యువతిని దళిత కులానికి చెందిన యువకుడు వివాహమాడాడన్నా అక్కస్సుతో మూకుమ్మడిగా అరుంధతి వాడపై దాడికి పాల్పడ్డారు. దొరికిన వారిని దొరికినట్లుగా కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఐదుగురు మహిళలే కావడం గమనార్హం. గురువారం తెల్లవారుజామున కావడంతో అప్పటికే పురుషులు పొలాలకు వెళ్లడంతో దాడినుంచి బయటపడ్డారు. బాధితుల వివరాల మేరకు...

అంజూరు పాలెంకు చెందిన దళిత యువకుడు తులసీ రామ్(25), ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన లావణ్య(22) గత కొన్నాళ్లుగా ప్రేమలో ఉన్నారు. వీరి ప్రేమను పెద్దలు అంగీకరించకపోవడంతో నెల రోజుల కిందట ఇంటి నుంచి పారిపోయి గుడిలో పెళ్లి చేసుకున్నారు. దీన్ని జీర్ణించుకోలేని ఆమె తల్లిదండ్రులు, బంధువులు కేవీబీపురం పోలీస్ స్టేషన్లో తులసీరాంపై కిడ్నాప్ కేసు పెట్టారు. తమ కుమార్తెను వెంటనే తీసుకురావాలంటూ తులసీరామ్ బంధువులపై దౌర్జన్యానికి దిగారు. దీంతో తులసీరామ్, లావణ్య జంట ఈనెల 18న తిరుపతి ఎస్పీని ఆశ్రయించి తమకు లావణ్య బంధువుల నుంచి ప్రాణహాని ఉందంటూ ఫిర్యాదు చేశారు. అయితే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి కేసును ఈస్ట్ డిఎస్పికి రెఫర్ చేశారు. అక్కడ వారిరువురికి కౌన్సిలింగ్ ఇచ్చి కేసును పుత్తూరు డిఎస్పికి బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో బీఎస్పీ నాయకుల సమక్షంలో తులసి రామ్, లావణ్య జంటకు కౌన్సిలింగ్ ఇచ్చిన డిఎస్పి ఇరువురూ మేజర్లు కాబట్టి స్వతంత్రంగా జీవించవచ్చని సూచించి పంపేశారు. అయితే లావణ్య తల్లిదండ్రులు, బంధువుల నుంచి ప్రాణహాని ఉందన్న నేపథ్యంలో వారికి రక్షణ కల్పించాలంటూ నారాయణవనం సిఐ కి, కేవీబీపురం ఎస్ఐకి డీఎస్పీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అయితే డీఎస్పీ ఆదేశాలను నారాయణవనం సిఐ, కేవీబీపురం ఎస్ఐ పెడచెవిన పెట్టడంతో బుధవారం రాత్రి లావణ్య బంధువులు తులసిరాం బంధువులపై దౌర్జన్యానికి దిగారు. గురువారం తెల్లవారుజామున మూకుమ్మడిగా అరుంధతి వాడపై దాడి చేశారు. ఇళ్లల్లో ఉన్న మహిళలను బయటకు లాక్కొచ్చి కర్రలతో చితకబాదారు. ఈ దాడిలో జ్యోతి(35), సుజాత(25), బుజ్జమ్మ (30), చిన్నమ్మ(50), వెంకటమ్మ(51), బత్తెయ్య(45)లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో జ్యోతి పచ్చి బాలింత అని చూడకుండా దాడి చేయడం గమనార్హం. ఆమెను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు.

దళిత సంఘాల పరామర్శ

పోలీసుల నిర్లక్ష్యంపై ప్రజా సంఘాల ఫైర్

అంజూరు పాలెం అరుంధతి వాడపై పెత్తందారుల దాడి వెనుక పోలీసుల హస్తం, నిర్లిప్తత ఉందని ప్రజా సంఘాలు ఆరోపించాయి. గాయపడి శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను గురువారం కెవిపిఎస్, బీఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు పరామర్శించారు. లావణ్య బంధువులతో తులసిరాం బంధువులకు ప్రమాదం పొంచి ఉందనీ, వారికి వెంటనే రక్షణ కల్పించాలని పుత్తూరు డిఎస్పి నారాయణవనం సిఐని, కేవీబీపురం ఎస్సైని ఆదేశించినా వారు ఖాతరు చేయలేదని బీఎస్పీ రాష్ట్ర నేత నక్కా విజయ్ కుమార్ అన్నారు. దాడి చేశాక గ్రామానికి వచ్చి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించకుండా పోలీసులే అడ్డుపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిడంతోనే దళితులపై దాడి జరిగిందనీ, సంబంధిత పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. అదేవిధంగా దళితులపై పాశవికంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన అగ్రకులస్తులపై అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, బీఎస్పీ నాయకులు వేణుగోపాల్ రాజు, కె.ప్రభాకర్, ఆర్.పరుశురాముడు, ఎమ్మార్పీఎస్ నాయకులు గడ్డం బత్తెయ్య, భక్తవత్సలం, సురేష్ పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పటిష్టమైన ఏర్పాట్లు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలో తగినంత పార్కింగ్ లేకపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులను నివారించడానికి, ముఖ్యంగా అక్టోబర్ 8న గరుడసేవ రోజున భారీగా వచ్చే భక్తుల రద్దీ దష్ట్యా ఆర్టీసీ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

టీటీడీ పరిపాలన భవనం లో గురువారం ఈవో జె శ్యామలరావు, జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు ఇతర శాఖలతో భద్రత, రవాణా ఏర్పాట్లపై ప్రత్యేక దష్టి సారించి సమీక్షా సమావేశం నిర్వహించారు. గత రెండేళ్లుగా తిరుమలలో వాహనాల రాకపోకలు పెరగడంతో వాహనాలకు పార్కింగ్ స్థలాల కొరత తీవ్రంగా ఉంది. తిరుమలలో ట్రాఫిక్ రద్దీని నివారించడానికి, గరుడ సేవ రోజున భక్తులను తిరుమలకు తరలించడానికి ఏపిఎస్ఆర్టీసీ తగిన సంఖ్యలో బస్సులను నడపాలని సూచించారు. అదేవిధంగా చిన్నారులు తప్పిపోకుండా చైల్డ్ ట్యాగింగ్, లగేజీ సెంటర్‌ను ప్రస్తుతం ఉన్న కామన్ కమాండ్ సెంటర్ పాయింట్ నుండి వార్షిక బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకు సేవా సదన్ 1, 2 ఎదురుగా మార్చాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్‌వో శ్రీధర్, టిటిడిలోని వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు. జిల్లా యంత్రాంగం నుండి ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం చెంగల్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు. తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లలో అదనపు ఈవో వెంకయ్యచౌదరి గురువారం తనిఖీలు నిర్వహించారు.

'యువగళం' తొలి మైలురాయి హామీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

మంత్రి లోకేష్ చేతుల మీదుగా కిడ్నీ డయాలసిస్ యూనిట్‌ను బంగారుపాళ్యంలో శుక్రవారం ప్రారంభించనున్నారు. ఉమ్మడి చిత్తూరులో యువగళం తొలి మైలురాయి హామీకి కార్యరూపం దాల్చనుంది.

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో యువనేత లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుట్టారు. యువగళం పాదయాత్ర 100 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా 2023, ఫిబ్రవరి 3న బంగారుపాళ్యంలో కిడ్నీ డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అప్పట్లో శిలాఫలకం ఆవిష్కరించారు. ఇచ్చిన మాట ప్రకారం బంగారుపాళ్యంలో రూ.3 కోట్ల వ్యయంతో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రస్తుతం రోజుకు 10మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ నిర్వహించే అవకాశం ఉంది. భవిష్యత్తులో అవసరాన్ని బట్టి ఈ యూనిట్ సామర్థ్యాన్ని పెంచుతారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తి అవుతున్న సందర్భంగా మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఈ యూనిట్ ను శుక్రవారం ప్రారంభించనున్నారు. ఇదిలా ఉండగా యువగళం సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 100 కి.మీ. కి ఒకటి చొప్పున 5 మైలురాళ్ళను మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. మిగిలిన హామీల అమలుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. హామీలకు సంబంధించి ఆయా శాఖల మంత్రులు, అధికారులతో నిరంతరం చర్చలు జరుపుతున్నారు. సాధ్యమైనంత త్వరగా యువగళం హామీల అమలుకు శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారని టిడిపి శ్రేణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ ముందుగానే గురువారం రాత్రి జిల్లాకు చేరుకున్నారు.

నేడు డయాలసిస్ యూనిట్ ప్రారంభం

డయాలసిస్ యూనిట్ ప్రారంభించనున్న పిహెచ్‌సి

రుయా యాజమాన్యంతో కార్మికుల చర్చలు విఫలం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రుయా ఆసుపత్రిలో పనిచేస్తున్న ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గురువారం సాయంత్రం నాలుగు గంటల నుండి ఐదు గంటల వరకు రుయా యాజమాన్యంతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. ఈ చర్చలకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, నగర ప్రధాన కార్యదర్శి కే వేణుగోపాల్, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఏ నరసింహులు, గురవయ్య, సుబ్రహ్మణ్యం, కుమార్ పాల్గొన్నారు. రుయా సూపరింటెండెంట్ రవి ప్రభు ఇతర అధికారులతో చర్చలు జరిగాయి. కార్మికులపై పనిభారాన్ని అనేకమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో సమ్మె నోటీసును గత నెలలో అందించారు. అయితే ఈనెల మూడో తేదీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కోర్టు జోక్యం చేసుకుని కార్మికులతో సంప్రదింపులు జరిపి సమస్య పరిష్కరించాలని రుయా యాజమాన్యాన్ని కోరింది. ఈ నేపథ్యంలో గురువారం చర్చలు జరిగాయి. 23 డిమాండ్లతో వెళితే పనిభారంపై తాను స్పందించలేనని, పోస్టుల భర్తీ తన చేతుల్లో లేదని యాజమాన్యం పేర్కొంది. ఈ నేపథ్యంలో సమ్మె బాట పడతామని కార్మికులు యాజమాన్యాన్ని హెచ్చరించారు.

2047 విజన్ డాక్యుమెంట్ ఆచరణాత్మకంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ప్రణాళికలను మార్గదర్శకాల మేరకు ఆచరణాత్మకంగా తయారు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాలులో అమరావతి నుంచి సంబంధిత కార్యదర్శులతో కలిపి అన్ని జిల్లాల కలెక్టర్లకు, హెచ్‌ఒడిలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ వర్చువల్ విధానంలో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండికలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, డి ఆర్ ఓ పెంచల కిషోర్ సంబంధిత జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ తిరుపతి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాలు తిరుమల, శ్రీకాళహస్తి, పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని ప్రతి రోజూ సుమారు 75 వేల పైచిలుకు మంది తిరుమల, శ్రీకాళహస్తి లో 50 వేల మంది పర్యాటకులు జిల్లాను సందర్శిస్తుంటారన్నారు. జిల్లాలో ప్రముఖ స్టార్ హోటళ్లు ఉన్నాయని పర్యాటకులను కనీసం రెండు నుండి మూడు రోజులు ఉండేలా వారు జిల్లాలోని పర్యాటక, పుణ్యక్షేత్రాలను, ఫారెస్ట్, బీచ్ లు సందర్శించేలా ఆకర్షించగలిగితే స్థానికంగా యువతకు ఉపాధి, రెవెన్యూ ఉత్పాదన ఉంటుందని, ఆ దిశగా ఆచరణాత్మకంగా ఉండాలన్నారు. మైస్ టూరిజం, పరిశ్రమల స్థాపన అంశాలు జిల్లాలో గ్రోత్ ఇంజిన్లు అని తెలిపారు. డాక్యుమెంట్ నివేదిక అక్టోబర్ 15 లోగా అందజేయాలన్నారు. ప్రజలు భాగస్వాములయ్యేందుకు క్యూ ఆర్ కోడ్ అందుబాటులోకి తెస్తామన్నారు. రైల్వే స్టేషన్, బస్టాండ్, ప్రభుత్వ కార్యాలయాలు, తదితర ముఖ్య సెంటర్లలో క్యూ ఆర్ కోడ్ ఉంచుతామన్నారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయగానే ప్రజల అభిప్రాయాలను పొందుపరచవచ్చన్నారు.

జీవో 107, 108లను రద్దు చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్

మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని విద్యార్థి యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. తిరుపతి ఎన్టీఆర్ విగ్రహం సర్కిల్ వద్ద గురువారం నిరసన తెలిపారు. వైద్య విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని మాట్లాడారు. రానున్న రెండేళ్లలో రాష్ట్ర విద్యార్థులు 1750 ఎంబిబిఎస్ సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. పక్క రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలంగాణాలో 8,700 సీట్లు, తమిళనాడులో 10,600, కర్నాటకలో 11, 650 సీట్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 6,150 సీట్లు మాత్రమే ఉన్నట్టు వారు తెలిపారు. నారా లోకేష్ గారు యువ గళం పాదయాత్రలో తాము అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే జీవో నెం 107,108 రద్దు చేస్తామని ఇపుడు ఏకంగా ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెబుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘాల నాయకులు ఉదయ్‌కుమార్, జయచంద్ర, ఓబుల్‌రెడ్డి, అక్బర్, రవి, అశోక్, నగేష్, షేక్ జావిద్ పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - కెవిబిపురం

మండలంలోని బ్రాహ్మణపల్లి దళితవాడకు చెందిన పోలూరు రాంబత్తయ్య అప్పుల ఊబిలో కూరుకుపోయి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని, తని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. బ్రాహ్మణపల్లిలో రైతు కుటుంబాన్ని పరామర్శించారు. ఆత్మహత్య చేసుకున్న రైతులకు ఏడు లక్షల రూపాయలు ప్రకటించినందున తక్షణమే ప్రభుత్వం అందించి, ఆదుకోవాలని కోరారు. పరామర్శించిన వారిలో సిఐటియు మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు ఉన్నారు.

స్విమ్స్‌లో తల్లిబిడ్డ ఎక్స్ ప్రెస్ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో శ్రీ పద్మావతి హాస్పిటల్ గైనకాలజి విభాగంలో గురువారం గర్భవతుల సౌకర్యార్థం రెండు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను సంచాలకులు డాక్టర్ ఆర్వి కుమార్, డిఎంహెచ్‌ఒ డాక్టర్ శ్రీహరి జెండా ఊపి ప్రారంభించారు. స్విమ్స్ అభ్యర్థన మేరకు ప్రభుత్వం ఈ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సేవలు 24×7 పనిచేసేలా, 102 కాల్‌సెంటర్ ద్వారా సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో గైనకాలజీ విభాగం వైద్యులు డాక్టర్ మృదుల, డాక్టర్ ప్రవల్లిక, డిప్యూటీ డైరెక్టర్ (నర్సింగ్) ప్రభావతి, తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ తిరుపతి జిల్లా కోఆర్డినేటర్ వి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

పండుగలు, బ్రహ్మోత్సవాల ఎఫెక్ట్

రైళ్లలో బెర్తులు 'ఫుల్'

డబుల్ డెక్కర్‌కు ఆదరణ కరువు

ప్రత్యేక రైళ్లలో కాస్తంత ఉపశమనం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

దసరా, దీపావళి, సంక్రాంతి పండుగల ప్రభావం... రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్ అయ్యాయి. ముందస్తుగా సెలవు దినాలకు రిజర్వేషన్ చేసుకుందామని ప్రయాణికులు భావిస్తే 'ట్రైన్ ఫుల్' అయ్యి అవకాశమే లేకుండా ఉంది. అంతోఇంతో ప్రత్యేక రైళ్లలో కాస్త అవకాశం కనిపిస్తోంది. అయితే డబుల్ డెక్కర్ ట్రైన్‌లో మాత్రం ఖాళీలున్నాయి. సీటింగ్ సరిగ్గా లేకపోవడం, 14 గంటలు ప్రయాణం చేయాల్సి రావడంతో ఈ డబుల్ డెక్కర్‌ను ప్రయాణికులు ఆదరించడం లేదు. విశాఖ నుంచి తిరుపతికి మరో రైలు నడపాలన్న డిమాండ్ ప్రయాణికుల నుంచి వస్తోంది.

తిరుపతి వెళ్లే రైళ్లలో బెర్తులు లభించడం గగనంగా మారింది. తిరుమల ఎక్స్‌ప్రెస్ (17488), హౌరా- బెంగళూరు (12863), పూరి-తిరుపతి, బిలాస్పూర్- తిరుపతి, వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504) వంటి రోజువారీ రైళ్లతోపాటు వారాంతపు, వారంలో రెండుసార్లు (బై వీక్లీ) నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఏడాది పొడవునా డిమాండ్ ఉంటోంది. ప్రయాణికులు ముందస్తుగా యత్నించినా ఆశించిన తేదీల్లో బెర్తులు పొందలేని పరిస్థితులు నెలకొన్నాయి. తిరుపతితోపాటు సమీప స్టేషన్లు రేణిగుంట, గూడూరు, నాయుడుపేట వెళ్లేందుకు రోజుకు దాదాపు 12 రైళ్లుఅందుబాటులో ఉన్నాయి. అయితే విశాఖ నుంచి బయలుదేరే శాశ్వత రైళ్లు కేవలం రెండు (తిరుమల ఎక్స్‌ప్రెస్, డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్) మాత్రమే ఉన్నాయి. మిగిలిన రైళ్లన్నీ ఇతర ప్రాంతాల నుంచి విశాఖ మీదుగా నడిచేవి. దీంతో విశాఖ నుంచి తిరుపతి బయలుదేరే తిరుమల ఎక్స్ ప్రెస్ (17488)కు డిమాండ్ అధికంగా ఉంటోంది. తిరుమల ఎక్స్‌ప్రెస్ విశాఖ నుంచి బయలుదేరే, తిరుపతి చేరే సమయం ప్రయాణికులకు అత్యంత అనుకూలంగా ఉండడంతో అత్యధికులు ఈ రైలుకు ప్రాధాన్యమిస్తుంటారు.

డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెట్టినప్పటి నుంచి ఆక్యుపెన్సీ అంతంత మాత్రంగానే ఉంది. ఈ రైలు విశాఖలో బయలుదేరే సమయం (రాత్రి 11 గంటలకు), తిరుపతి చేరే సమయం (మధ్యాహ్నం 12.30 గంటలు) అనుకూలంగా లేకపోవడం ఒక కారణమైతే...సుమారు 14 గంటలు కూర్చొని ప్రయాణించాల్సి రావడం మరో కారణం. అందుకే ప్రయాణికులు డబుల్ డెక్కర్ వైపు అంతగా ఆసక్తి చూపడం లేదన్న అభిప్రాయాలు ఉన్నాయి. ప్రయాణికుల డిమాండ్ను బట్టి రైల్వే అధికారులు ప్రవేశపెట్టిన ప్రత్యేక వారాంతపు రైలు అనుకూలంగా ఉన్నా కొద్దిమందికే ఉపయోగపడుతోంది. ప్రత్యేక రైలుకు అప్పటికప్పుడు వెళ్లాల్సిన ప్రయాణికులతో సాధారణ డిమాండ్ ఉంటోంది.తిరుమల ఎక్స్ప్రెసకు నవంబరు 26 వరకు బెర్తులు ఫుల్. దసరా సెలవులతోపాటు తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఉండడంతో తిరుమల ఎక్స్ప్రెసకు ప్రస్తుతం తీవ్ర డిమాండ్ ఏర్పడింది. నవంబరు 26 వరకూ బెర్తులు నిండిపోయాయి. అన్ని ఏసీ క్లాసులతోపాటు స్లీపర్ క్లాస్ కోచ్లకు కూడా నిరీక్షణ జాబితా ఏర్పడింది. అయితే అక్టోబరు 30, 31 తేదీలో మాత్రం ఏసీ కోచ్‌ల్లో కొన్ని బెర్తులు అందుబాటులో ఉన్నాయి. తిరుగు ప్రయాణ తిరుమల ఎక్స్‌ప్రెస్‌దీ అదే పరిస్థితి. తిరుపతి నుంచి విశాఖ చుట్టుపక్కల ప్రాంతాలకు వచ్చే ప్రయాణికులకు తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో (17487) బెర్తులు లభించే పరిస్థితి లేదు. అటు నుంచి వచ్చే తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు (17487) కూడా నవంబరు నెలాఖరు వరకు దాదాపు బెర్తులు నిండిపోయాయి.

భువనేశ్వర్-తిరుపతి ఎక్స్ ప్రెస్ నవంబర్ 24 వరకూ...

తిరుపతి విశాఖ మీదుగా భువనేశ్వర్ వెళ్లే వారాంతపు సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెసలో నవంబరు 24 వరకు బెర్తులు నిండిపోయాయి. ప్రతి శనివారం అందుబాటులో ఉండే భువనేశ్వర్-తిరుపతి సూపర్ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు (22879) నవంబరు 23 వరకు, ప్రతి ఆదివారం నడిచే భువనేశ్వర్-తిరుపతి సూపర్ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(22871)లో నవంబరు 24 వరకు బెర్తులు నిండిపోయాయి. ఈ రైళ్లకు నవంబరు 30, 31 తేదీల నుంచి బెర్తులు ఖాళీ ఉన్నాయి.

ప్రత్యేక రైళ్లలో అందుబాటులో బెర్తులు

ప్రతి సోమవారం విశాఖ నుంచి తిరుపతి వెళ్లే ప్రత్యేక రైలు (08583)లో బెర్తులు అందుబాటులో ఉన్నాయి. ఈ రైలుకు అక్టోబరు నెలలో కూడా ప్రతి సోమవారం బెర్తులు ఉన్నాయి. తిరుమల ఎక్స్‌ప్రెస్, ఇతర రైళ్లలో బెర్తులు లభించని వారు ప్రత్యేక రైళ్లను ఆశ్రయించే పరిస్థితి నెలకొంది. రోజువారీ, వారాంతపు రైళ్లకు డిమాండ్ ఇతర ప్రాంతాల నుంచి విశాఖ మీదుగా నడిచేరోజువారీ, వారాంతపు రైళ్లకు అక్టోబరు నెలాఖరు వరకు డిమాండ్ ఉంది. హౌరా-బెంగళూరు రోజువారీ ఎక్స్‌ప్రెస్(12863)కు నవంబరు 21 వరకు కొన్ని తేదీల్లో ఫస్ట్‌ఏసీ, సెకండ్ ఏసీ మినహా బెర్తులు నిండిపోయాయి. పూరి-తిరుపతి (17479), బిలాస్పూర్-తిరుపతి(17481), - (22851), హటియా-బెంగళూరు (12835), వివేక్ ఎక్స్ప్రెస్(22504), 2 (12254),ఎక్స్ప్రెస్ (12660) వంటి రైళ్లకు అక్టోబరు నెలాఖరువరకూ డిమాండ్ నెలకొంది.

విశాఖ-తిరుపతి మధ్య మరో రైలుకు డిమాండ్...

విశాఖ-తిరుపతి మధ్య ప్రతిరోజూ నడిచేలా శాశ్వత ప్రాతిపదికన మరో రైలు ప్రవేశపెట్టాలని చాలాకాలంగా డిమాండ్ ఉంది. రైల్వే అధికారులు దానిపై దష్టి పెడుతున్న దాఖలా కనిపించడం లేదు. ప్రయాణికుల డిమాండును దష్టిలో ఉంచుకుని శాశ్వత ప్రాతిపదికన రోజువారీ సర్వీసుల రూపంలో కొత్త రైలు ప్రవేశపెట్టాలని, ప్రజా ప్రతినిధులు దీనిపై దష్టిసారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్రీడా దుస్తులు వితరణ

తిరుపతి(మంగళం): మంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడలకు ఎంపికైన విద్యార్థులకు రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల సౌజన్యంతో ప్రధానోపాధ్యాయులు కేశవులు నాయుడు టీ షర్టులు, షాట్స్‌ను వితరణగా అందించారు. ఈ సందర్భంగా దాత రమేష్ నాథ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో అపారమైన క్రీడాప్రతిభ దాగి ఉంటుందని, ప్రతిభకు పదునుపెట్టి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో గెలుపొందాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

'వెలుగు' అవినీతిపై విచారణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తొట్టంబేడు మండలం చియ్యవరం పంచాయతీలో వెలుగు పథకం నిధులు దుర్వినియోగంపై గురువారం విచారణ జరిగింది. డ్వామా ఫైనాన్స్ విభాగం డిపిఎం వెంకటేష్, బ్యాంకు లింకేజీ యాంకర్ పర్సన్ సుబ్బారెడ్డి, జిల్లా శ్రీనిధి ఏపీఎం హేమంత్ కుమార్ తో పాటు మరో 9 మంది ఫైనాన్స్ జీఎంజీలు, ఏపీఎంలు, సీసీలు విచారణలో పాల్గొన్నారు. సమగ్ర విచారణ అనంతరం నివేదికలు జిల్లా ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు వెంకటేష్ తెలిపారు.

పవిత్రోత్సవాల్లో అపశ్రుతులు శోచనీయం

- మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో అపశ్రుతులు దొర్లడం శోచనీయమని, అధికారుల్లో జవాబుదారీతనం కొరవడటం వల్లే తప్పిదాలు దొర్లుతున్నాయని మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ఆలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన 'పవిత్రోత్సవాల్లో' ప్రతి రోజూ ఏదో ఒక తప్పిదం చోటు చేసుకుందన్నారు. ఇందుకు నిదర్శనమే మంగళవారం రాత్రి గ్రామోత్సవంలో చోటు చేసుకున్న సంఘటన అని ఆయన వివరించారు. అధికారుల అలసత్వం భక్తులను మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రానికి ఇది మంచిది కాదన్నారు. ఇలాంటి ఘటనలు పవిత్ర పుణ్యక్షేత్రానికి మంచిది కాదన్నారు. దీన్ని వెంటనే 'సంప్రోక్షణ' చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

నేడు అన్న క్యాంటీన్లు ప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీకాళహస్తిలో అన్న క్యాంటీన్లు పునఃప్రారంభం కానున్నాయి. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శుక్రవారం రామసేతు వంతెన వద్ద, ఏరియా ఆసుపత్రికి వెళ్లే దారిలో ఉన్న రెండు అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నారు. గతంలో ఉన్న ఆ క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం మూసివేసింది. కూటమి ప్రభుత్వం తిరిగి అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తుండడంతో పట్టణ ప్రజలు హర్ష వ్యక్తం చేస్తున్నారు.

కిరణ్ మృతికి నివాళి

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: నారాయణవనం మండలం వైసీపీ నాయకులు రాజా కుమారుడు ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు నూకతోటి రాజేష్ గురువారం కిరణ్ మృతదేహానికి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో ఎంపిపి దివాకర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు పాల్గొన్నారు.

చిట్టేడు సొసైటీలో మహాజన సభ

ప్రజాశక్తి-కోట: మండలంలోని చిట్టేడు పంచాయతీలో పిఏసీఎస్‌లో ఆఫీషియల్ పర్సన్ ఇన్ ఛార్జ్ శ్యామ్ కుమార్, సంఘ సీఈఓ రామారావు అధ్యక్షతన గురువారం మహాజన సభ నిర్వహించారు. సమావేశంలో సంఘ సభ్యుల కేవైసీ, అదేవిధంగా కేవైసీ లేని సభ్యుల సభ్యత్వం రద్దు, పిఏసీఎస్ కంప్యూటరీకరణ, సీఎస్‌సీ ట్రాన్సక్షన్ తదితర అంశాలపై చర్చించారు. ముఖ్య అతిథులుగా టీడీపీ సీనియర్ నాయకులు, సొసైటీ మెంబర్ చాపల శ్రీనివాసులు, కోట డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్, సూపరవైజర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'వంద రోజుల పాలన సంతృప్తికరం'

ప్రజాశక్తి-కోట: కూటమి ప్రభుత్వం తొలి వంద రోజుల పాలన సంతృప్తినిచ్చిందని జనసేన జిల్లా కార్యదర్శి అల్లం బాబు అన్నారు. గురువారం కోట పంచాయతీ కార్యాలయంలో అధికారుల సమక్షంలో కేక్‌కట్ చేసి వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటేశ్వరరావు, కృష్ణ, మల్లికార్జున, నాగేంద్ర, గంగ, పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిఎస్ఐ చాప్టర్ పునఃప్రారంభం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఆదిశంకర ఇంజనీరింగ్ కలశాలలో సిఎస్ఐ చాప్టర్‌ను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ వేణు మాధవ్ మాట్లాడుతూ సిఎస్ఐ చాప్టర్ పునః ప్రారంభించడం ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చునన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రాజయ్య, రాజేష్, పద్మావతి, ఇమ్మానుయేలు, రామయ్య, కళ్యాణ్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేదపారాయణం

భజనలు చేస్తున్న భక్తులు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని సనత్ నగర్‌లో శ్రీ సత్య సాయి స్పిరిచువల్ అండ్ సర్వీస్ సొసైటీ, సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో వేద పారాయణం, భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా సత్య సాయి బాల వికాస్ ఇన్‌ఛార్జ్ రాజేశ్వరి మాట్లాడుతూ భగవంతుని కొరకు జీవించడం సేవ అని, భగవంతునితో జీవించడం నిజమైన విద్య అని తెలిపారు. యువత ధార్మిక కార్యక్రమాల వైపు దృష్టి సారించాలి అన్నారు. కార్యక్రమంలో తీరివీధి సుబ్బారావు, భవాని, దాము ప్రతాప్, 63మంది భక్తులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

ఆర్థిక సాయం అందిస్తున్న జయరాజ గోపాల్

ప్రజాశక్తి-నాయుడుపేట: విజయవాడ వరద బాధితులకు పట్టణానికి చెందిన పారిశ్రామిక వేత్త పెసల జయరాజ గోపాల్ రూ.లక్ష విరాళపు చెక్కును మాజీ ఎంపి నెలవల సుబ్రమణ్యం, మాజీ ఏఎంసీ ఛైర్మన్ శిరసనం బేటి విజయ భాస్కర్‌రెడ్డిలకు అందజేశారు. గురువారం మాజీ ఎంపిని నాయుడుపేటలో ప్రత్యేకంగా కలిసి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కిషోర్ బాబు, రమేష్ బాబు, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి గ్రామశక్తి శ్రీ పోలేరమ్మ తల్లి జాతర పర్వదినం పురస్కరించుకొని మాజీ మున్సిపల్ ఛైర్మన్ దొంతు శారద, బాలకృష్ణ దంపతులు గురువారం పట్టణంలోని పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఆలయం ఈవో శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరుద్యోగులకు రక్షణ కల్పించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలంలోని చిరు ఉద్యోగులకు రక్షణ కల్పించాలని వడమాలపేట సిఐటియు అనుబంధ సంఘాలతో గురువారం సిఐటియు కార్యాలయంలో ఆర్.వెంకటేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ చిరు ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మోడీ ప్రభుత్వం మూడోసారి

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

అధికారంలోకి వచ్చి కార్మికులకు కడుపు కొట్టే చట్టాలను తీసుకురావడానికి ప్రయత్నం చేయడం దారుణమన్నారు. ఆ ప్రయత్నాలకు మన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడానికి పూనుకోవడం చెప్పారు. రాష్ట్రంలో, జిల్లాలో చిరు ఉద్యోగులు పైన రాజకీయ వేధింపులు మానుకోవాలని, లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు వై.నందయ్య, జయరామయ్య, అంగన్వాడీ నుంచి కృష్ణవేణి, జయంతి, గంగులమ్మ, చంద్రమ్మ, సంఘమిత్రల నుంచి కమలమ్మ, రుక్మిణమ్మ, సుభద్ర, వీఆర్ఏల నుంచి లోకనాథం, దామోదరం, పంచాయతీ నుంచి శ్రీనివాసులు పాల్గొన్నారు.

'కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి'

ప్రజాశక్తి-గూడూరు టౌన్: కూటమి ప్రభుత్వం కౌలు రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం గూడూరు డిప్యూటీ తహశీల్దార్ సురేంద్రకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్న రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం బాధాకరం అన్నారు. ప్రతి ఏటా అన్నదాత పెట్టుబడి సాయం రూ.20వేలు అందించాలన్నారు. రెండు లక్ష రూపాయల వరకు రైతుల రుణాలు రద్దు, వ్యవసాయ మోటారుకు మీటర్లు, జీవో నెం.22 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు బివి రమణయ్య, సురేష్, ప్రసాద్, రైతులు మురళీమోహన్ రెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

డీటీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి: సిపిఎం

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: కెవిబి పురం మండలం అంజూరుపాలెం గ్రామంలో దళితులపై అగ్ర కులస్తులు దాడి చేసి గాయపరచడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంజూరుపాలెంలోని దళిత యువకుడు అగ్రకుల మేజర్ అయిన అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడనే నెపంతో పెత్తందారులు కేవలం ఎనిమిది కుటుంబాలు ఉన్న దళితులను విచక్షణారహితంగా దాడి చేసి గాయపరచడం దారుణమన్నారు. వారి ఇళ్లను వస్తువులను చిన్నాభిన్నం చేసి భయభ్రాంతులకు గురిచేసి వారిని ఊరిలో ఉంటే చంపేస్తామని బెదిరించి అనాగరికంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు, కెవిపిఎస్ మండల కార్యదర్శి దావల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు రూరల్ పరిధిలోని తాళమ్మ గుడి వెనుక ప్రాంతంలోని ఓ రైతుకు చెందిన పొలంలో ఉన్న రేకుల షెడ్ వద్ద పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగు చూసింది. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు మృతుడు పొదలకూరు ప్రాంతానికి చెందిన మస్తాన్(65)గా గుర్తించామన్నారు. ఇతను గత రెండు ఏళ్లుగా పట్టణానికి చెందిన ఓ రైతు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారన్నారు. కేసు దర్యప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

- వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): పూతలపట్టు - నాయుడుపేట, జాతీయ రహదారిలో గురువారం తెల్లవారు జామున మామండూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కథనం మేరకు.. తిరుపతి వైపు నుంచి చిత్తూరుకి వెళ్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడని స్థానికుల సమాచారంతో నేషనల్ హైవే సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు మృతదేహాన్ని తరలించారు. మృతి చెందిన వ్యక్తి చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లికి చెందిన రవి(32)గా తెలిసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: కేవిబి పురం మండలంలోని ఆరే గ్రామంలో నివాసముంటున్న తోట సావిత్రమ్మ గురువారం తమ పొలం వద్దకు వెళ్లి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో పిచ్చాటూరు నుండి బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని నాలుగు సవరాలు బంగారు చైన్‌ను లాక్కుని పరారయ్యారు. ఆమె కేకలు సమీప పొలాల్లోని వారు అక్కడి చేరుకొని విషయాన్ని తెలుసుకొని దొంగల కోసం వెంబడించారు. దుండగులు పరారవడంతో కేవీబీ పురం పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేశారు.

సత్యవేడులో..

ప్రజాశక్తి-సత్యవేడు: పట్టపగలే సినీ పక్కిలో మహిళ వద్ద నుంచి బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్లిన సంఘటన పట్టణంలో గురువారం వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోనే గుడి వీధిలో నివసిస్తున్న అనసూయమ్మ మార్కెట్‌కు నడిచి వెళుతుండగా ఇద్దరు యువకులు ఆమె వద్ద ఆగారు. దొంగలు అధికంగా ఉన్నారని తాము రాజస్థాన్ స్పెషల్ బ్రాంచ్ పోలీసులమంటూ మాయమాటలు చెప్పి బంగారు గొలుసు తీసేయాలని మాయ చేసి గొలుసు తీయగానే లాక్కుని బైక్‌పై పరారైయ్యారని తెలిపారు. ఇంతలో విషయం తెలుసుకున్న సీఐ మురళీనాయుడు, ఎస్ఐ రామస్వామిలు సంఘటనా స్థలానికి చేరుకొని సీసీ కెమెరాల ద్వారా దుండగులకు గుర్తించే పని ఉన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

ఇసుక లారీలు సీజ్

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: అక్రమంగా తమిళనాడుకు ఇసుక తరలిస్తున్న లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. అందిన సమాచారం మేరకు అనుమతులు లేకుండా రాచకండ్రిగ సమీపం నుంచి తమిళనాడు వైపుగా వెళుతున్న మూడు ఇసుక లారీలను అడ్డుకున్నట్లు వివరించారు. లారీలు సీజ్ చేసి డ్రైవర్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు స్పష్టం చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇద్దరు మహిళా దొంగల అరెస్ట్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుమలకు వచ్చే భక్తుల ను మోసగించి, వారు వద్ద నగదు నగలు చోరీ చేస్తున్న ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నట్లు క్రైమ్ ఏఎస్‌పి నాగభూషణరావు తెలిపారు. స్థానిక క్రైమ్ పోలీస్ స్టేషన్లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమిళనాడు తిరుచ్చికి చెందిన భగవత్ శారద(32), ఆర్.ప్రియ(26) ఇద్దరు కలిసి వారితో పాటు చిన్న పిల్లలను పెట్టుకొని తాము యాత్రికులు అంటూ రైల్వేటేషన్, బస్టాండ్, విష్ణు నివాసం, శ్రీనివాస కాంప్లెక్స్ తదితర రద్దీ ప్రాంతాల్లో యాత్రికులతో కలిసి బస్సు ఎక్కుతూ, యాత్రికుల వద్ద ఉన్న నగదు నగలు హ్యాండ్ బ్యాగులు చేసేవారన్నారు. వీరిపై నిఘా ఉంచిన క్రైమ్ పోలీసులు టీపి ఏరియాలోని టీపీపీఎం స్కూల్ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి వద్ద నుంచి 07 లక్షల విలువ గల 70గ్రాముల బంగారు, మూడు సెల్ ఫోన్లు, నగదు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. నిందితుల అరెస్టు సొత్తు స్వాధీనానికి సహకరించిన పోలీస్ సిబ్బందిని అభినందించారు. సమావేశంలో డీఎస్పీ రమణకుమార్, సిఐ అబ్బన్న పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేర రహిత సమాజమే లక్ష్యం

శ్రీకాళహస్తిలో 2కే రన్ విజయవంతం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: నేర రహిత సమాజమే లక్ష్యంగా పోలీసు శాఖ అడుగులు వేస్తోందనీ, ప్రజల నుంచి తమకు సంపూర్ణ సహకారాలు అందించాలని శ్రీకాళహస్తి డీఎస్పి కే.నరసింహమూర్తి పిలుపునిచ్చారు. పట్టణంలో డ్రగ్స్, నేరాల నిర్మూలన కోసం శ్రీకాళహస్తి పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 2కే రన్ విజయవంతమైంది. డిఎస్పి శాంతికపోతాన్ని ఎగురవేసి, పచ్చ జెండాను ఊపి 2కే రన్ ప్రారంభించారు. స్థానిక ది స్కూల్ నుంచి పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పోలీసులు, ఉపాధ్యాయులు, యువత ఈ రన్‌లో పాలుపంచుకున్నారు. డ్రగ్స్ వాడకం వల్ల సమాజంలో నేరాలు ఎలా అధికమవుతున్నాయో, కుటుంబాలు ఎలా విచ్ఛిన్నమవుతున్నాయో డిఎస్పీ ప్రజలకు

ర్యాలీ చేపడుతున్న పోలీసులు

వివరించారు. సమాజంలో నానాటికీ వేన్నూళ్లుకుంటున్న డ్రగ్స్ కారణంగానే యువత భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి లాంటి చిన్న పట్టణంలో కూడా డ్రగ్స్ వినియోగం విచ్చలవిడిగా ఉందంటే ప్రమాదం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవాలన్నారు. డ్రగ్స్ విక్రయాలు, వినియోగంపై పోలీసులకు సమాచారం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సీఐలు గోపీ, తిమ్మయ్య, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూకు ఐఎస్ఓ గుర్తింపు

ప్రజాశక్తి-క్యాంపస్: హైదరాబాద్‌కు చెందిన హెచ్ఓఎమ్ ఇంటర్‌నేషనల్ సంస్థ రెండు రోజులుపాటు ఎస్వీయూను పరిశీలన చేసి, సభ్యులు టీమ్‌లుగా వివిధ శాఖలను, పరిపాలనా భవనాన్ని, విద్యాప్రమాణాలను, అవస్థాపన సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్వీయూకి ఐఎస్ఓ గుర్తింపు లభించడం పట్ల విసి ఆచార్య సిహెచ్. అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఐఎస్ఓ ప్రతినిధి శివయ్య ఎస్వీయూ అధికారులను కలసి ఐయస్ఓ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. విసి మాట్లాడుతూ ఎస్వీయూ చరిత్రలో ఐయస్ఓ నంబర్ రెన్యువల్ పొందడం చిరస్మరణీయ అధ్యాయమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, ప్రాచ్య పరిశోధన సంస్థ సంచాలకులు ఆచార్య పిసి వెంకటేశ్వర్లు, ఆచార్య నరసింహ పాల్గొన్నారు.

ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న సంస్థ సభ్యులు

బంగ్లాదేశ్ సంక్షోభాన్ని నివారించడంలో ఇండియా పాత్ర కీలకం

- విసి ఆచార్య సిహెచ్ అప్పారావు

ప్రజాశక్తి-క్యాంపస్: ఇటీవల బంగ్లాదేశ్‌లో ఏర్పడిన సంక్షోభాన్ని నివారించడంలో భారతదేశం కీలక పాత్ర వహించిందని ఎస్వీయూ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు పేర్కొన్నారు. ఎస్వీయూలోని పొలిటికల్ సైన్స్ విభాగం, పలమనేరులోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాల పొలిటిక్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ వెబినార్ "బంగ్లాదేశ్ సంక్షోభం: భారతదేశం మరియు దక్షిణాసియాపై పరిణామాలు" అనే అంశంపై గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దక్షిణాసియాలో బంగ్లాదేశ్లో ఏర్పడిన సంక్షోభం ఇతర దేశాలపై పడిందని వాటిని నివారించడంలో భారతదేశం కీలక పాత్ర వహించింది అన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల డీన్ ఆచార్య బివి మురళీధర్, ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ

క్రమశిక్షణతోనే ఉన్నత రంగాలలో రాణింపు: విసి ఆచార్య జేవి రమణ

ప్రజాశక్తి-క్యాంపస్: విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకొని ప్రణాళికబద్ధంగా, పట్టుదలతో చదవడం ద్వారా ఉన్నత రంగాలలో ఉన్నతంగా రాణించగలరని ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయం విసి ఆచార్య జెవి రమణ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం, పశువైద్య కళాశాల దినోత్సవం "అనంత్య 2024" కార్యక్రమానికి గురువారం వర్సిటీ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో పాఠాలను చక్కగా అవగాహన చేసుకుని విద్యలో ఉన్నతంగా రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ జగపతి రామయ్య, డీన్ ఆచార్య వీరబ్రహ్మం, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటంపై ఆరోపణలు

- ఏపీవో, సర్పంచ్ నేతృత్వంలో విచారణ

ప్రజాశక్తి-సత్యవేడు: మండలంలోని రాజగోపాలపురం గ్రామంలో ఉపాధి హామీ కూలీలు తమను ఫీల్డ్ అసిస్టెంట్ డబ్బులు అడిగి వేధిస్తున్నారంటూ మండల అధికారికి చేసిన ఫిర్యాదు నేపథ్యంలో గురువారం ఏపీవో కృష్ణయ్య, సర్పంచ్ మధురాజు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా కూలీలు ఈ విచారణకు సంబంధించి తమకు ఎలాంటి సమాచారం లేదని ఉదయం ఉపాధి హామీ కూలీ పని కొరకై దాదాపు 30మంది హాజరయ్యామని, ఈ సమాచారం తమకు ఇవ్వలేదని వాపోతూ వచ్చారు. అనంతరం ఏపీవో కృష్ణయ్యతో మాట్లాడుతూ విచారణలో భాగంగా సుధా, చంద్రకళ, శశి, సుబ్రహ్మణ్యం, ఈశ్వరమ్మ, నరసరాజు, మోహన్ రాజు మొదలైన వారు ఫీల్డ్ అసిస్టెంట్ జయప్రద, టెక్నికల్ అసిస్టెంట్‌లపై ఫిర్యాదు చేశారు.

'బీజేపీ తీరు మార్చుకోకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు'

ప్రజాశక్తి-సత్యవేడు: బీజేపీ తన వైఖరి మార్చుకోకుండా ప్రజలే బుద్ధిచెబుతారని కాంగ్రెస్ పార్టీ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బాలగురువం భాస్కర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు, పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని తీవ్రవాది అని, ఆయన నాలుక కోసి తెస్తే 11 లక్షలు ఇస్తామని బిజెపి మిత్రపక్ష పార్టీల నాయకులు రెచ్చగొట్టేలా, దాడులు చేయించి ప్రాణహాని కలిగించేలా మాట్లాడటాన్ని ఖండించారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్, శేఖర్, దాము, అశోక్, వినోద్ కుమార్, గాంధీ, శంకర్, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ధి వృద్ధుడు కొణిదల కన్నయ్య నాయుడు మృతి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని తిరుపతి రోడ్డులో నివాసం ఉంటున్న కొణిదల కన్నయ్య నాయుడు (102) శతాబ్ది కాలంగా జీవించాడు. ఆయనకు ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. ఆయన ఎటువంటి వైద్యం చేసుకోకుండా, మందులు తీసుకోకుండా ఆరోగ్యంగా జీవించేవాడు. గురువారం ఉదయం హఠాత్తుగా మృతి చెందారు. పట్టణంలోని పలువురు నాయకులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

కన్నయ్య నాయుడు(ఫైల్)

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటిన్లు: ఆరణి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: పేదల ఆకలి తీర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. నగరంలోని స్విమ్స్ కూడలి, ఎంఆర్ పల్లి, ఈఎస్ఐ హాస్పిటల్ సమీపంలో ఏర్పాటు చేసిన నాలుగు అన్న క్యాంటిన్లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్.మౌర్య, కార్పొరేటర్లు, తదితరులు గురువారం సాయంత్రం ప్రారంభించారు.

గూడూరులో..

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను గురువారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి సంధ్య రాణి, నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, చెంచురామయ్య, పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

'చెకుముకి' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి టాలెంట్ టెస్ట్‌కి సంబంధించి పోస్టర్లును గురువారం పుత్తూరు ఎంఈవోలు తిరుమల రాజు, బాలసుబ్రమణ్యం చేతుల మీదుగా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పిల్లల్లో మూఢనకాల పట్ల విశ్వాసాన్ని తొలగించడం సైన్స్ పట్ల అభిరుచి కల్పించడం ఈ పరీక్ష ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. కార్యక్రమంలో చెకుముకి కోఆర్డినేటర్లు వేణుగోపాల్, నరేంద్ర, విజయనాగు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ అధికారులు

బంగారు తాళిబొట్లు వితరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: నూతన వధూవరులకు వైసిపి తొట్టంబేడు మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవ నాయుడు, ఎంపీపీ నిర్మల దంపతులు బుధవారం రాత్రి బంగారు తాళి బొట్టు బహూకరించారు. వాసుదేవ నాయుడు తన స్వగ్రామమైన పొయ్య, తాటిపర్తి పంచాయతీలలో వివాహం చేసుకునే పేద జంటలకు ఉచితంగా తాళిబొట్లను పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో తాటిపర్తి పంచాయతీలోని మల్లిగుంట గ్రామానికి చెందిన కన్నలి రంగయ్య కుమారుడు మనోహర్‌కు వివాహం జరుగుతుందన్న సంగతి తెలిసి వారి గ్రామానికి వెళ్ళి తాళిబొట్టును అందజేశారు.

తాళిబొట్టును అందజేస్తున్న వాసుదేవనాయుడు దంపతులు

వేడుకగా రాక్‌వర్త్ పరిశ్రమ వార్షికోత్సవం

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: ఆఫీస్ ఫర్నిచర్ తయారీలో అగ్రగామి సంస్థ రాక్‌వర్త్ సిస్టమ్స్ ఫర్నీచర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు గురువారం శ్రీసిటీలోని తన అత్యాధునిక పరిశ్రమ 13వ వార్షికోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. 2011సెప్టెంబరు 19న కంపెనీ స్థాపన జరిగి, దశాబ్దం పాటు కంపెనీ వృద్ధి, నాణ్యత, నిబద్ధతకు సాక్ష్యంగా ఈ కార్యక్రమం సాగిందని వారు తెలిపారు. వేడుకలలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ శైలేష్ కుమార్ సింగ్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీరామ్ రాయన, ఇతర సిబ్బంది సమక్షంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శైలేష్ కుమార్ మాట్లాడుతూ తమ సిబ్బంది అంకితభావం, కస్టమర్ల నమ్మకం, శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబం సహకారం రాక్‌వర్త్ విజయానికి మూల స్తంభాలుగా పేర్కొన్నారు. నూతన ఆవిష్కరణలు, నాణ్యత పట్ల రాక్‌వర్త్ నిబద్ధతను స్పష్టం చేసిన ఆయన, భవిష్యత్తులో దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్, ప్రభుత్వ కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా విభిన్నమైన ఫర్నిచర్ తయారీని కొనసాగిస్తామని చెప్పారు.

మొక్కలు నాటుతున్న కంపెనీ సీఈవో శైలేష్‌కుమార్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: కమిషనర్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎం రెడ్డి అన్నారు. గురువారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణ పరిధిలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతకు ప్రజలందరి సహకారం అవసరమన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు తనిఖీ చేస్తున్న కమిషనర్

చంద్రగిరి డిఎస్పీగా ప్రసాద్ బాధ్యతలు

ప్రజాశక్తి-రామచంద్రాపురం(తిరుపతి రూరల్): చంద్రగిరి డీఎస్పీగా గురువారం బేతపూడి ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా పనిచేస్తూ చంద్రగిరికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యంగా పనిచేసే ప్రజల కు జవాబుదారితనంతో విధులు నిర్వర్తిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పోలీసులు డీఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాభినందనలు తెలిపారు.

డీఎస్పీ ప్రసాద్

ఇసుజు మోటార్స్‌లో కొత్త క్యాబ్-ఛాసిస్ వేరియంట్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: కొత్త ఇసుజు డి-మాక్స్ 1.7 వాహన శ్రేణికి కొత్త క్యాబ్ చాసిస్ వెరియంట్ జోడించినట్లు ఆ సంస్థ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ టోరు కిషిమోటో తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేటి పరిస్థితులకు అనుగుణంగా, వినియోగదారులను ఆకట్టుకునేలా సరికొత్త మోడల్స్‌తో ఈ వాహనాన్ని రూపొందించామన్నారు. రూ.9,99,999 ధరతో అందరికీ అందుబాటులో ఈ వాహనాన్ని తీసుకొచ్చామని, దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వినియోగదారులు మరింత ఉత్పత్తి సమాచారం కోసం సమీప ఇసుజు డీలర్షిప్‌కు కాల్ చేయవచ్చునని సూచించారు. 1800 4199 188 (టోల్ ఫ్రీ)కి సంప్రదించాలని కోరారు.

వరద బాధితులకు ఎస్సీవీ రూ.10లక్షల విరాళం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: విజయవాడ వరద బాధితుల కోసం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు గురువారం రూ.10లక్షల విరాళాన్ని సీఎం చంద్రబాబుకు అందజేశారు. వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో విజయవాడలో సీఎంని కలిసి అందజేశారు. ఎస్సీవీతో పాటు ఆయన తనయుడు శ్రీకాంత్ నాయుడు పాల్గొన్నారు.


సీఎంకు విరాళాన్ని అందిస్తున్న ఎస్సీవీ నాయుడు

ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ నిషేధించాలి: వీసీ ఉమ

ప్రజాశక్తి-క్యాంపస్: సమాజంలో ప్రతి ఒక్కరూ మనసా వాచా కర్మేనా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడానికి కృషి చేయాలని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వి.ఉమ పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయం కార్బన్ న్యూట్రాలిటీ, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా స్వచ్ఛతాహి సేవలో భాగంగా యూనిట్ 5, యూనిట్ 14, యూనిట్ 16 వాలంటీర్స్‌తో కలిసి గురువారం క్యాంపస్లో ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు సేకరించారు. ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరు నిషేధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, ఆఫీసర్లు మాధవి, ఆఫీసర్ వజిహాబాను,అనిత, ఆచార్య విద్యావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో 27మంది కానిస్టేబుళ్లు బదిలీ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: జిల్లాలో ఒకే చోట పనిచేస్తున్న 27మంది కానిస్టేబుళ్లను వివిధ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ సుబ్బారాయుడు గురువారం ఆదేశాలు జారీ చేశారు. తిరపతి ఈస్ట్, అలిపిరి, వెస్ట్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న వారిని జిల్లా వ్యాప్తంగా ఇతర స్టేషన్‌లకు, ఇతర ప్రాంతాలలో పని చేసే వారిని తిరుపతికి, తదితర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఈ మేరకు బదిలీ అయిన ప్రదేశాల్లో ఆయా కానిస్టేబుళ్లు రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE :: PILER

H.M.O.P No. 60 Of 2023

Pappu Aruna Teja,
...Petitioner

Vs

Pappu Deepthi Priyanka
...Respondent

NOTICE TO RESPONDENT

To
Smt Pappu Deepthi Priyanka, W/o Aruna Teja, D. No.13-6-600-44/193, Near Partha Dental Hospital, P.K. Layout, Tirupati Town and District.

Where as the above named petitioner filed the above petition for grant of Divorce and the same is hereby posted to 23.10.2024 for your appearance. Hence, you are hereby noticed to attend either personally or through a pleader and represent your case, else the matter will be decided as ex-parte. By order of the Honorable court.

//By Order of the Honorable Court//

A. NARASIMHA REDDY
Advocate for Petitioner